

పాల్గొన్న కమ్మ కులస్తులు



సినీ నటుడు మానవ కోటేశ్వరరావును సన్మానిస్తున్న మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు దంపతులు

# సమాజ సేవలో భాగస్వాములు కావాలి

- కులసంఘాలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఉండాలి
- మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు
- బోధన్‌లో కమ్మ సంఘం రజతోత్సవం, కార్తిక వనభోజన మహోత్సవం
- గౌరవ అతిథిగా పాల్గొన్న సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు మల్లవరపు బాలలత

బోధన్, డిసెంబర్ 10: కమ్మ కులస్తులు తమ కులస్తుల అభివృద్ధికి తోడ్పాటు అందించడంతోపాటు సమాజసేవలో భాగస్వాములు కావాలని, తమ వ్యకిత్వంతో సమాజంలో ఆదర్శంగా నిలవాలని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. బోధన్ పట్టణంలో రెండు రోజులపాటు జరిగిన కమ్మ రజతోత్సవ వేడుకలు, కమ్మవారి కార్తిక వనభోజనం మహోత్సవంలో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కులసంఘాలు రాజకీయపార్టీలకు అంకితం కారాదని, రాజకీయ పార్టీలకు అతీతంగా కుల సంఘాలు.. అవి ఏ కులసంఘాలైనా ఉండాలని ఆయన తన అభిమతాన్ని వ్యక్తంచేశారు. ఏ కులంవారైనా వ్యక్తులుగా తమకు నచ్చిన రాజకీయ పార్టీల్లో ఉండవచ్చని, వ్యక్తులుగా వారి విచక్షణతో రాజకీయాల్లో ఉండడం తప్పు కాదన్నారు. బోధన్ కమ్మ సంఘం చేపట్టిన కార్యక్రమాలు అభినందనీయమని, మున్ముందు మరిన్ని కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కమ్మ సంఘం తన కులం వరకు పరిమితం కాకుండా భవిష్యత్తులో సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసే స్థాయికి ఎదగాలని మండవ అన్నారు.

### పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

తల్లిదండ్రులు తమ పిల్లలను ఉపాధ్యాయులు, ఇంజినీర్లుగా తయారుచేయటానికి పరిమితం అవుతున్నారని, దేశ పాలనారంగంలో సేవలు అందించే సివిల్ సర్వెంట్స్‌గా వారు ఎదిగేందుకు కృషిచేయడంలేదని హైదరాబాద్‌కు చెందిన సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు, కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ మల్లవరపు బాలలత అన్నారు. ఈ కార్యక్రమానికి ఆమె గౌరవ అతిథిగా హాజరై మాట్లాడారు. సివిల్ సర్వీసెస్‌లో చక్కని అవకాశాలు ఉన్నాయని, ఈ వైపుగా కమ్మ కులస్తులు దృష్టిని సారించాలని కోరారు. తన తండ్రి స్వగ్రామం బోధన్ మండలం జాడిజమాల్‌పూర్ గ్రామమని, ఒక జర్నలిస్ట్‌గా ఆయన ఉమ్మడి రాష్ట్రంలోని అనేక చోట్ల పనిచేశారన్నారు. తనకు చిన్నతనంలోనే పోలియో సోకి అంగవైకల్యం వచ్చినప్పటికీ, తన తండ్రి ఇచ్చిన ప్రోత్సాహంతో తాను ఐఏఎస్ సాధించానని, తన సివిల్ సర్వీస్ ఉద్యోగానికి రాజీనామాచేసి అనేక మందికి కోచింగ్ ఇచ్చి ఐఏఎస్ ఆఫీసర్లను తయారుచేశానని చెప్పారు. పట్టుదల, కష్టపడే తత్వం ఉంటే ఏదైనా సాధించవచ్చని తన జీవితం ద్వారా నిరూపించానని అన్నారు.

### ఘనంగా కార్యక్రమాలు

బోధన్‌లో కమ్మ సంఘం రజతోత్సవాల్లో భాగంగా రెండో రోజున ఆదివారం కార్తిక వనభోజనం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కమ్మ కులస్తులు తరలివచ్చి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. ఉత్సవానికి హాజరైన ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమానికి కమ్మ సంఘం అధ్యక్షుడు పల్లెంపాటి శివన్నారాయణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు సతీమణి నళిని, సినీ నటుడు మానవ కోటేశ్వరరావు, సంఘ సేవకులు ముమ్మలనేని రాజశేఖర్, పీవీ సుబ్బారావు, కమ్మ సంఘం కార్యదర్శి దావులూరి హరనాథ్‌బాబు, కోశాధికారి పల్లెంపాటి శ్రీధర్‌బాబు, రజతోత్సవాల ప్రోగ్రాం చైర్మన్ గంగవరపు ఆదినారాయణ, ప్రోగ్రాం కో-చైర్మన్ ఎం.అప్పారావు, కమ్మ సంఘం ప్రతినిధులు పి.గాంధీ, ఇ.వి.రంగారావు, పెనుమర్తి శ్రీహరి, అశోక్, కరుటూరి సూర్యనారాయణ, మేదరమెట్ల రమేశ్, పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వహకురాలు, రక్షణ మంత్రిత్వశాఖ మాజీ డిప్యూటీ డైరెక్టర్ మల్లవరపు బాలలత

# కార్పొరేట్ దవాఖానల్లో మెరుగైన వైద్యం



రాజీవ్‌ఆరోగ్యశ్రీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి



బోధన్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతీ శరత్‌రెడ్డి, ఆర్డీవో రాజాగౌడ్



భీమ్‌గల్‌లో బస్సును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత, ఎంపీపీ మహేశ్

బోధన్, డిసెంబర్ 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయం రూ.10 లక్షలు' పథకాన్ని ఆదివారం బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతీ శరత్‌రెడ్డి బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ప్రారంభించారు. వారు పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతీ శరత్‌రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ దవాఖానల్లో కూడా మెరుగైన వైద్య చికిత్సలను పొందేందుకు వీలుగా రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని రూ.10 లక్షలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని అన్నారు. ఈ పథకాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదని ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్‌తోపాటు డిప్యూటీ డీఎం హెచ్‌వో డాక్టర్ సమత, ప్రభుత్వ జిల్లా దవాఖాన ఇన్‌చార్జి ఆర్‌ఎంవో రహీమ్ సోఫీ, మున్సిపల్ కౌన్సిలర్లు తూము శరత్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యనారాయణ, అంకు దాము తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం

బోధన్ మండలం జాడిజమాల్‌పూర్ గ్రామంలో బోధన్ డిపోకు చెందిన బోధన్ నుంచి ఖండ్‌గావ్‌కు ఆ గ్రామం గుండా వెళ్లే ఆర్టీసీ బస్సులో 'మహిళలకు ఉచిత ప్రయాణం' పథకాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖండ్‌గావ్‌కు వెళ్లే బస్సును మామిడాకులు, పువ్వులతో ముస్తాబుచేశారు. బస్సు నడిపే డ్రైవర్, కండక్టర్లను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బోధన్ మాజీ ఎంపీపీ చైర్మన్ బి.గంగాశంకర్, మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు డి.నాగేశ్వర్‌రావు, వై.నరేందర్‌రెడ్డి, సుందర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### సద్వినియోగం చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్10: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత సౌకర్యం కల్పించినందున దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కోరారు. ఆర్మూర్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకం బస్సును ఆదివారం ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, ఆర్డీవో వినోద్‌కుమార్ ప్రారంభించి మహిళలకు ఉచిత టికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రాజీవ్ ఆరోగ్యశ్రీని సద్వినియోగం చేసుకోవాలి**

రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖానలోఆర్డీవో వినోద్‌కుమార్‌తో కలిసి రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల విలువ చేసే వైద్యం ప్రభుత్వం నుంచి అందనుందని తెలిపారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, డాక్టర్ అమృతా రామ్‌రెడ్డి, డాక్టర్ అజయ్, అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్, డిసెంబర్ 10: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని భీమ్‌గల్ బస్టాండ్‌లో జెండా ఊపి మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలతా సురేందర్, మండల పరిషత్ అధ్యక్షుడు ఆర్మూర్ మహేశ్, జడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, నోడల్ అధికారి, జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వాహణాధికారి ఐ. గోవిందు, డిపో మేనేజర్ ప్రారంభించారు. చేయూత పథకంలో భాగంగా రాజీవ్ ఆరోగ్యశ్రీలో రూ.10 లక్షల వరకు కల్పించనున్న వైద్య సదుపాయంపై పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, మెడికల్ ఆఫీసర్ అజయ్ పవార్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ముసిగిన ఖోఖో పోటీలు

నందిపేట్, డిసెంబర్ 10: మండల కేంద్రంలోని గీత కాన్వెంట్ స్కూల్ ఆవరణలో మూడు రోజులుగా నిర్వహించిన తెలంగాణ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఖోఖో చాంపియన్స్ ఫర్ బాయ్ అండ్ గర్ల్స్ పోటీల ఆదివారం ముగిశాయి. ముగింపు సమావేశానికి తెలంగాణ ఖోఖో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నాతి కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓడిన వారు నిరుత్సాహపడకండా మరోసారి గెలుపునకు కృషి చేయాలని అన్నారు. క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గంగాసాగర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి గంగసాగర్, ఎంపీరాజు, లింగయ్య పాల్గొన్నారు.

## నేడు శివపార్వతుల కల్యాణం

శక్కర్‌నగర్, డిసెంబర్ 10: బోధన్ పట్టణంలోని చక్రేశ్వర శివమందిరంలో సోమవారం శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్ (బుజ్జి), ధర్మకర్తలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తిక మాసం చివరి సోమవారం, మాస శివరాత్రి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఆలయ అర్చకుడు గణేశ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆలయ కమిటీ చైర్మన్ బీర్కూర్ శంకర్, ధర్మకర్తలు లక్ష్మణ్ రావు పటేల్, ఎంఎల్ బాబు, మాశెట్టి నర్సయ్య గుప్తా, జెల్లనారాయణ, ఈరపురం పోశెట్టి, నంద్యాల శ్యాం కోరారు.